

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

## – పవని నిర్మల ప్రభావతి

పధ్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్థం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల "చైతన్య రాహిత్యంలో స్త్రీ"

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

**శాంతిక్కూడా** ఫక్కున నవ్వొచ్చింది అతగాడి మాటలకు. కారు దిగింది.

నవ్వుతూ ఇంట్లోకి వస్తున్న ముగ్గుర్నీ పరకాయించి చూసారు శ్రీహరిరావుగారు. చిన్న ఇల్లు. వరండాలో ఉన్న నాలుగు గాద్రెజ్ కుర్చీలలో కూర్చున్నారు నలుగురూ, కమల తల్లి శ్రీలక్ష్మమ్మ నాలుగు స్టీలు గ్లాసులలో కాఫీలు తెచ్చింది.

"సుధీర్ నాన్నా వీరు! శాంతి బావ" అంటున్న కమల మాటలకు అడ్డు వస్తూ...

"ఇదొక్కటే నండి ప్రస్తుతం నా క్వాలిఫికేషన్" అన్నాడు సుధీర్ నవ్వుతూ.

"కాదులే నాన్నా. బి.ఏ. బి. ఎల్. పాసై బిజినెస్ చూచుకుంటున్నారు" అంది కమల నవ్వుతూ.

పది నిమిషాలు కూర్చుని శ్రీలక్ష్మి దగ్గరా శ్రీహరిరావుగారి దగ్గరా శలవు పుచ్చుక కారులో కూర్చున్నారు సుధీర్, శాంతిలు. కారు కదిలేవరకూ తండ్రి, కూతురు వీధి వాకిట్లోనే నిల్చున్నారు.

"టా టా" చెప్పి వెనుదిరిగిన కమల వేపు కొత్తవ్యక్తి వేపు చూసినట్లు క్షణ కాలం చూశారు శ్రీహరిరావుగారు. తర్వాత ఇంట్లోకి వెళ్లి పోయారు.

వందలాది విద్యార్థులకు సైన్సు పాఠాలు క్షుణ్ణంగా బోధించిన ఆయనగారికి మొదటి బెంచీలో కూర్చుని శ్రద్ధగా పాఠం వింటునట్లు నటిస్తూ, మాష్టారు వేపే కళ్ళప్పగించి చూస్తూనే పక్క బెంచీలోని ఆడపిల్ల వేపు డెస్కు క్రింద నుంచి చీటీ విసరి వేస్తున్న విద్యార్థి మనస్తత్వమూ తెలుసు.

అమాయకంగా కనిపిస్తూ తనని ఫలానా కుర్రాడు అల్లరి పెడుతున్నాడని పదే పదే గుసగుసగా చెబుతూ, రిపోర్టు యిస్తూ నిజంగా అమాయకుడయిన ఆ కుర్రాడి చూపు తన మీదకు మరలేలా అతి తెలివిగా ప్రవర్తించే విద్యార్థిని మనస్తత్వమూ తెలుసు.

క్లాసు క్లాసుకీ ఏ ఏటి కా ఏడు వందల విద్యార్థులను స్టడీ చేసిన ఆయనగారు, కన్న కూతురి కళ్ళలో మెరుపూ, నవ్వులో విరుపూ, సుధీర్ ను పరిచయం చేస్తూ, మాట్లాడుతూ, 'టా టా' చెబుతూ పరోక్షంగా విరజిమ్మబడిన వయసు మెరుపులూ గమనించక పోలేదు.

"సుధీర్ ఎప్పుడొచ్చాడమ్మా కమలా శాంతి వాళ్ళింటికి?"అన్నారు ఆ రాత్రి యధాలాపంగా అడిగినట్లు.

"పదిరోజులు పైగా అయింది నాన్నా! భలే సరదా మనిషి నాన్నా! కొత్తా పాతా, పేదా గొప్పా ఏం తేడాలేని మనిషి. వారం రోజుల క్రితం నేను శాంతి కోసం వెళితే ఎంత చక్కగా గౌరవంగా మాట్లాడాడు, శాంతి నన్ను పరిచయం చేస్తే! ఇంకా శాంతికే మనం వాళ్ళ అంతస్తుకు తగమన్న గుర్రు ఉందేమో గానీ, అతగాడికదేం లేదు. ఈ రోజు మనింటికి రమ్మనగానే వచ్చేసాడు" అంది కమల గబగబా.

ఆ మాట అంటున్నప్పుడు ఆమె కళ్ళలోని వెలుగును స్పష్టంగా గమనించారాయనగారు.

"ఊహుఁ! మంచి కుర్రాడు. బుద్ధిమంతుడు. బహుశా శాంతిని అతగాడికిచ్చి పెళ్లి చేస్తారనుకుంటాను." కళ్ళ చివరల నుంచి కూతుర్ని చూడనట్లే చూస్తూ అన్నారు ఆయనగారు.

"ఏమో తెలీదు." ముభావంగా అంది. కించిత్తు ఈర్ష్య.

"తెలియక పోవటమేం తల్లీ! వాళ్ళిద్దర్నీ అలా చనువుగా తిరగనిస్తున్నారంటే, కేశవరావుగారి ఉద్దేశ్యం అదే. బహుశా త్వరలోనే ముహూర్తం పెట్టేస్తారు. మొత్తం మీద శాంతి, సుధీర్ చక్కటి జంట అమ్మా! అంతస్తులోనూ, ఆస్తిలోనూ అంద చందాలలోనూ సమ ఉజ్జీలుగా వున్నారు. చూడ ముచ్చటగా వున్నారు. అలా అన్ని విధాలా సమంగా ఉన్నపుడే ఆ

వైవాహిక జీవితం సుఖంగా, శాంతిగా వుంటుంది. ముఖ్యంగా వియ్యానికి, నేయ్యానికి, కయ్యానికి సమాన అంతస్తు ఉన్నప్పుడే అందం అమ్మా!"

కమల చాలాసేపు మాట్లాడనే లేదు. ఆమెకు తండ్రి అలా అనటం నచ్చ లేదు. రుచించలేదు. పైగా కర్ణకఠోరంగా కూడా వున్నాయి ఆ మాటలు. అలా అని బయట పడనూ లేదు. ఎలాగో గొంతు పెగుల్చుకు అంది.

"శాంతికి చాలా గర్వం నాన్నా!"

"కొత్తగా వచ్చింది అంటావా? ఇంతక్రితం నీ ప్రాణస్నేహితురాలిగా వుంటునప్పుడు కూడా వుందంటావా?" నవ్వుతూ అన్నారాయన. కూతురి మీద జాలి ఉప్పెనలా పొంగుతోంది ఆయనగారి హృదయంలో. కూతురి హృదయంలో పేరుకోబోతున్న అనవసరపు ఆశల్ని, ఇప్పుడే మొదట్లోనే నేర్పుగా పెకలించి వేయటం మంచిదని ఆయనగారి పితృ హృదయమూ, మాష్టారి మనస్తత్వమూ, అన్నిటినీ మించి జీవితానుభవాల్ని కాచి వడబోసిన జ్ఞానమూ చెబుతున్నాయి. ఆ కార్యక్రమంలో కాస్తంత నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించవలసి వచ్చినా వెనుకాడ దలచుకోలేదు ఆయనగారు.

"ఈ మధ్యే నాన్నా!"

"బహుశ సుధీర్ వచ్చాక అయి వుంటుంది. నువ్వు కరెక్టుగానే ఊహించావు తల్లీ! కానీ ఒకటి ఆలోచించు. ఆర్ధికంగా అడుగున వున్న, మన మధ్య తరగతి కుటుంబీకులం ఎంతటి ఆత్మాభిమానాన్ని ప్రదర్శిస్తామో గమనించు. ఆ ఆత్మాభిమానం అనే 'అహం' ఒక్కటే మన మధ్య తరగతి కుటుంబీకుల ఆస్తి! అది లేకపోతే మనం లేం. దాని కోసం ఎవర్నీ లెక్క పెట్టం. ఎవరికీ తలవంచం.

అంటే ఏమిటి? ఏమీ లేని మనం, ఆత్మాభిమానం అనే అహంకారాన్ని అణువణువునా ప్రదర్శించుకుంటూ, ప్రదర్శించుకోకపోతే మన వ్యక్తిత్వాలు చచ్చిపోయి మనం జీవచ్చవాలుగా మిగిలి పోతాం. మరి శాంతికి... శాంతిలాటి వారికి డబ్బుంది! ఆ డబ్బు తెచ్చే గొప్ప ఉంది. ఆ డబ్బు తెచ్చే హోదా వుంది! కృతిమమైనవైనా సరే! అక్కర కొద్దీ ఇతరులు చేసే మెప్పులూ, నమస్కారాలు, స్తోత్ర పాఠాలు వున్నాయి. ఇన్ని వున్నప్పుడు ఆ మాత్రం గర్వం, అహంకారం ఉండవా? అంచేత వాళ్ళతో పోటీ పడటమో, వాళ్ళని అనుకరించటమో, వాళ్ళలో కలసి పోవాలనుకోవటమో చేసే కంటే, మనం మనదైన వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ మనం, మనంగానే మన ప్రత్యేకతని నిలబెట్టుకోవటమే మన కర్తవ్యం. ఏమంటావు?"

కమల మాట్లాడ లేదు. తండ్రి వేపు చూచింది. ఆయన ఏదో నిగూడార్ధంతో తనని హెచ్చరిస్తున్నట్లుంది అనిపించింది క్షణకాలం. కానీ ఆయన సాధారణంగానే మాట్లాడుతున్నట్లు, రాత్రి పూట ఈజీచేర్ లో రిలాక్స్ అయి మాట్లాడుతున్నట్లే మాట్లాడుతున్నారు.

"మన ఆత్మాభిమానం విలువ చెయ్యవు వాళ్ళ కోట్లు. మన మేధ, మానవత్వం, దూరాలోచనకు సరిగావు వాళ్ళ నోట్లు! ఆర్ధికంగా వాళ్ళు ఉన్నతులైతే గావచ్చు. మానసికంగా, మానవత్వపు విలువల పరిధిలో మనం మహోన్నతులం! ఈ గర్వం మనది. ఆ గర్వం వాళ్ళది. అంచేత మన మార్గంలో మనం మన ధ్యేయం ఏమిటో మరచి పోకుండా సాగిపోవాలి. అలాటి దీక్ష మనలో వుంటే ఎవరి గర్వాలూ, నిర్లక్ష్యాలు మనల్ని ఏమీ చెయ్యలేవు. కోట్లాది మానవులలో శాంతి ఒకర్తే. సుధీర్ ఒకడు. డబ్బు సంపాదించటం, ఖర్చు పెట్టడం, విందులు వినోదాలు... తిరిగి ఆ సంపద తమ వారసులకు అంద చెయ్యటం. ఇదే వారిలాటి వారి జీవితాలూ, జీవిత ధ్యేయాలూ.

కానీ నేనలా కాదు. నువ్వలా కాదు. వందలాది విద్యార్థుల్ని వెన్నుతట్టి, వెలుగు బాట చూపించాను నేను. వాళ్ళలో ఎందఱో యాక్టర్లు, డాక్టర్లు, మామూలు మనుషులు... నా ఇన్స్పిరేషన్ తో తయారయ్యారు. ఆ తృప్తి, ఆ గర్వం ఎన్ని కోట్ల డబ్బు కూడ బెడితే వస్తుందంటావు? నువ్వు నా కూతురివి! నీకు తగిన భర్తను ఎంచుకుంటావు! నీ సంసారాన్ని నీ సంస్కార బలంతో అద్భుతంగా నడుపుకుంటావు. నీ సంస్కారపు వారసత్వాన్ని నీ బిడ్డలకు పంచుతావు. ఉద్యోగం చేస్తావు అవసరమైతే! అందులోనూ నీ సంస్కారం నిన్ను వూరికే ఉండనివ్వదు. పదుగురికి మార్గదర్శకం అవుతావు. ఇదెంత చక్కటి బాటో, ఎంత గర్వకారణమైన దారో ఆలోచించు. నీవు నడిచే బాటలో నీ శాంతి లాటి వారి గర్వాలు... అణగారి పోతాయి ఆలోచిస్తే. నిద్ర వస్తున్నట్లుంది, పడుకో. హాయిగా చదువుకో. తరచూ శాంతి ఇంటికి వెళ్ళకు. కారణం ఆమెకు గర్వం అంటున్నావు కాబట్టి!"

మరి చెప్పవలసినదేమీ లేనట్లు ఆయన వెళ్ళి తన మంచం మీద పడుకున్నారు, కమలకు నాన్న మాటలలో ఏదో హెచ్చరిక వినిపించింది. ఏదో ఆజ్ఞ ధ్వనించింది. మరేదో కర్తవ్యం స్ఫురించింది. ఇంకేదో గమ్యం దృగ్గోచరమైంది.

కానీ మనసులో ముద్రించుకు పోయిన సుధీర్ నవ్వు, నడక, ఠీవి, అందం, పర్సనాలిటీ... వాటన్నిటినీ అధిగమించి మనస్సునూ, శరీరాన్నీ శాంతి ఇంటి వేపు శాంతి కోసం కాకుండా కేవలం సుధీర్ కోసం పరుగులు తీయిస్తున్నాయి.

మర్నాడు కాలేజీలో కూర్చుందే గానీ, లెక్చరరు చెబుతున్న పాఠం కాస్తంతయినా బుర్రకెక్కటం లేదు. శాంతి ఈ రోజూ కాలేజీకి రాలేదు. బహుశా ఆ టైంలో శాంతి, సుధీర్ లు మేడ మీద గదిలో కూర్చుని కబుర్లాడుతూ ఉంటారా? శాంతితో అల్లరిగా ప్రవర్తిస్తుంటాడా సుధీర్? ఛ... ఛ... పెళ్లి కాకుండా అలా చనువుగా ప్రవర్తిస్తుందా? ఏమో కేశవరావు

బాబాయిగారు చాలా సోషల్ గా వుంటారు కొన్ని విషయాలలో. ఎలాగూ కాబోయే భార్యా భర్తలే కదాని... ఊహుం. పెళ్లి కాకుండా అంత చనువు తప్పు కదూ!

"కమలా!" లెక్చరర్ గొంతుక ఖంగుమంది. ఉలిక్కిపడింది కమల. శాంతి, సుధీర్ ల హాస పరిహాసాలు మనోనేత్రం ముందునుంచి మాయమయ్యాయి. కానీ లెక్చరర్ అడిగిన ప్రశ్నేమిటో తెలీలేదు. తన ముందు బెంచీ వాళ్ళు ముగ్గురు చెప్పలేక నిల్చుని వున్నారు. తను 'బ్రిల్లియంట్ స్టూడెంట్' అనే ఉద్దేశ్యంతో కాబోలు తనని అడుగుతోంది.

కమల నిల్చున్న తీరులోనే ఆమె ప్రశ్న కాదు కదా, పాఠం కూడా వినటం లేదని బోధపడిపోయింది లెక్చరర్ కి.

"పగటి కలలు కనటానికి కాలేజి వరకూ రానక్కర లేదమ్మా. ఫీజులు కట్టి పుస్తకాలు కొని, తల్లిదండ్రుల్ని ఆర్థిక పరంగా తొక్కి, ఇక్కడ కూర్చుని ఊహాలోకాల్లో తేలిపోవటం చాలా అమానుషం. వారం రోజులుగా చెప్పిన సబ్జెక్ట్ లో ఒక చిన్న ప్రశ్న వేస్తే ఇలా నిల్చుండి పోయావే, షేం!"

లెక్చరర్  భవాని చాలా స్ట్రిక్ట్ మనిషి. చక్కగా పాఠం చెబుతుంది. విద్యార్థుల్లో కొమ్ములు తిరిగిన రౌడీ అయినా సరే ఆమె కళ్ళెర్రచేస్తే గజగజలాడి పోతారు. ఆమె మనిషి ఎంత మృదువుగా కనిపిస్తుందో, అంత చండ శాసనురాలు. అలా అని చీటికీ మాటికీ కసురుకొని తనని తాను చులకన చేసుకునే కోపిష్టి కాదు. కో ఎద్యుకేషన్ వున్న ఈ కాలేజిలో వున్న నలుగురు ఆడ లెక్చరర్స్ లో ఆమె ఒకర్తె విద్యార్థుల నుంచి గౌరవాన్ని, భయభక్తులని, క్రమశిక్షణని రాబట్టుకోగలిగింది.

"సారీ మేడం! చాలా తలనొప్పిగా వుంది. కొద్దిగా జ్వరంగా కూడా వుంది" అంది కమల లోగొంతుకతో. క్లాసులోని మగపిల్లలు హేళనగా చూస్తుంటే తలొంచుకుని, నిజంగానే తల పగిలి పోతున్నట్లుంది కమలకు. తలలో హోరు.

"అలాగా! మరి శెలవు పెట్టి ఇంటి కెళ్లలేక పోయావా?" నొచ్చుకుంటునట్లు అంది భవాని మేడం.

"పర్మిషన్ ఇస్తే వెళతాను."

"వెళ్ళు."

కమల మెల్లిగా క్లాసు రూం బయటకు వచ్చింది. కాలేజి కాంపస్ దాటుతుండగా ఇద్దరు ముగ్గురు స్నేహితురాళ్ళూ, క్లాసు కుర్రాళ్ళూ, లెక్చరర్లూ అడిగారు,

"ఇంటికా?" అని.

“ఊం. తలనొప్పిగా వుంది” అంటూ వచ్చేసింది. కానీ కాలేజి గేటు దాటాక ఇంటికెళ్ళాలని అనిపించలేదు. సిటీ బస్సు ఎక్కి శాంతి వాళ్ళ బంగాళా దగ్గర బస్ స్టాప్ లో దిగి శాంతి వాళ్ళ బంగాళా కేసి నడిచింది చకచకా. కేశవరావు గారా టైంలో బంగాళాలో వుండరు. బిజినెసు ఆఫీసులో వుంటారు.

“శాంతి ఉందా పిన్నీ?” అంది మీనాక్షమ్మతో.

“లేదమ్మా! వాళ్ళ పిన్ని ఫోన్ చేసి రమ్మంటే వెళ్ళింది. బహుశా సాయంత్రం వస్తుంది” అంది కూర్చోమని సోఫా చూపుతూ.

కేశవరావుగారి తమ్ముడు వాసుదేవరావు కూడా ఈ సిటీలోనే వున్నాడు. సిటీ ఆ కొసనుంది వాళ్ళ బంగాళా. వాసుదేవరావు భార్య విశాలాక్షి చాలా మంచిది. వాళ్లకి నలుగురు మగపిల్లలు. ఆడపిల్లలంటే అపరిమితమైయిన ముద్దు. తరచూ శాంతి కోసం వస్తూంటారిక్కడికి. లేదా ఫోన్ చేసి పిలిపించుకుంటారు. “బాగా డబ్బున్న వాళ్లకి ఏదయినా ముచ్చటే అమ్మా” అంటూంటారు శ్రీహరిరావు నవ్వుతూ కమలతో.

కాఫీకప్పు పట్టుకు వచ్చి మీనాక్షమ్మ అడిగింది. “నువ్వీరోజు కాలేజికి వెళ్ళలేదా కమలా?”

“వెళ్లాను పిన్నీ! తలనొప్పిగా వుంటే వచ్చేసాను. శాంతికి ఈ పదిరోజులు పాఠాలు పోయాయి కదా? నోట్సులిచ్చి వెడదామని వచ్చాను. దాని దగ్గర నా పుస్తకాలు కొన్ని వున్నాయి. అవి పట్టుకు పోదామని వచ్చాను” అంది మెల్లిగా.

సుధీర్ వూరికి వెళ్లి పోయాడేమో! లేక శాంతి వెంట వాసుదేవరావు గారింటికి వెళ్ళాడేమో? ఎలా అడగటం?

“అలాగా! ఏమిటో దీని చదువు పెళ్లి చదువైపోయింది. బొత్తిగా చదువు మీద శ్రద్ధ లేదు. దానికి తోడు సుధీర్ వచ్చాడా? తా చెడ్డ కోతి వనమెల్లా చెరిచిందన్న సామెతగా.” మీనాక్షమ్మ నవ్వింది. ఆ మాటలలో నొచ్చుకోవటం లేదు.

“నే వెళతా పిన్నీ! రేపు వస్తా. మళ్ళీ పుస్తకాల కోసం.” లోలోపల విసుగుదల అణచుకుంటూ లేచింది కమల.

“శాంతి రూంలో నీ పుస్తకాలేవో చూసుకుని తీసుకెళ్లమ్మా! మళ్ళీ రేపు రావాలంటే కష్టం కదా” అంది మీనాక్షమ్మ ఇంట్లోకి వెళ్తూ.

అయిష్టంగా మేడమెట్లు ఎక్కుతూ అప్రయత్రంగా పైకి చూసి ఆశ్చర్య పోయింది. రెయిలింగ్ పక్కగా సుధీర్ స్థంభం చాటు చేసుకుని నిల్చుని తనవేపే చూస్తున్నాడు. అడుగు తడబడి ఆగిపోయింది.

తల ఆడిస్తూ రమ్మనట్లు సైగ చేసాడు. మంత్రముగ్ధలా వెళ్ళింది.

“పుస్తకాల కోసం వచ్చారా?” మెల్లిగా అడిగాడు.

తలాడించింది,

“తీసుకోండి.” రూంలోకి నడిచాడు వెంట.

తడబడి పోయింది కమల.

“నేను శాంతి వెళ్లాం వాసుదేవరావు మామయ్య ఇంటికి. తీరా వెళ్ళాక నాకక్కడ తోచలేదు. రాత్రికి వస్తుందిట శాంతి. నే వచ్చేశాను తలనొప్పి సాకుపెట్టి. అరగంటగా  ఇక్కడ గోళ్ళు గిల్లుకుంటూ పడుకుని వున్నాను. మహా బోర్ కొడుతోంది. దేవతలా మీరొచ్చారు హాయి” అన్నాడు.

ఏం చెప్పాలో తోచలేదు. ఇలా అతగాడితో మాట్లాడటం మీనాక్షమ్మ పిన్ని చూస్తే ఏమనుకుంటుంది? నౌకర్లు చూస్తే ఏమనుకుంటారు? కమలకు లోలోపల హాయిగా వున్నా పయికి దడ వస్తోంది.

“అదేం? మీరు మూగనోము పట్టారా ఏం ఖర్మ?”

పుస్తకాల అల్మారా దగ్గర పుస్తకాలు పిచ్చిగా అటూ యిటూ సర్దుతున్న కమల వేపు నవ్వుతూ చూస్తూ అన్నాడు సుధీర్.

“ఊహుఁ.”

“మరి మాట్లాడరేం?”

“ఏం మాట్లాడనూ? శాంతి వుంటే బావుండేది.”

“ఐ సీ. శాంతి లేకుండా మరెవరూ లేకుండా నాతో మాట్లాడటం మీకు భయంగా వుంది. మీకు భయం అనే కంటే మిగతా వాళ్లెవరైనా ఏమైనా అనుకుంటారేమోనని భయంగా వుంది. అవునా?”

కమల నిర్ఘాంతపోయినట్లు చూసింది. ఆ అందమైన కళ్ళు, కనురెప్పలు క్షణ కాలం టపటపలాడాయి.

“మీ భయం కూడా ఎంత అందంగా ప్రతిఫలిస్తాయి మీ కళ్ళు!” బాగా దగ్గరగా వచ్చి నిల్చుంటూ అన్నాడు సుధీర్.

కమల తొట్రుపడింది.

“మీనాక్షమ్మ పిన్ని” అంది భయంగా.

"ఐ సీ. ఇక్కడ మీరు ఫ్రీగా నాతో మాట్లాడడానికి భయపడుతున్నారు. అత్త ఏమనుకుంటుందోనని బెదరి పోతున్నారు. ఆల్ రైట్! పదండి. మీరు బంగాళా దాటి రోడ్డు వారగా నిల్చుని వుండండి. నేను యిటు తోట వేపు వున్న మెట్లు దిగి తోటలో నుంచి రోడ్డు మీదకు వచ్చి మిమ్మల్ని కలుసుకుంటాను."

కమలకు ఎందుకో ఆ సలహా నచ్చింది. గబగబా నాలుగు నోట్సులు చేతబట్టుక కిందికి వచ్చింది. మీనాక్షమ్మ కిచెన్ లో వున్నట్లుంది.

"పిన్నీ! నేనెళ్ళొస్తా. శాంతి వస్తే నా నోట్సులు నేను తీసుకెళ్లానని చెప్పు" అంది,

"అలాగే అమ్మా" అందావిడ లోపల్నించే.

గబగబా బంగాళా ఆవరణ దాటి రోడ్డు మీదకు వచ్చి నడక సాగించింది. బంగాళా వెనకాల నుంచి సుధీర్ కూడా వచ్చేశాడు ఆసరికి.

"దొంగలా బయట పడుదామనుకున్నంతలో తోటమాలి చూడనే చూశాడు" అన్నాడు నవ్వుతూ,

"మరెలా?" అంది కమల భయంగా చూస్తూ,

"ఆ భయమే నన్ను ముగ్ధుణ్ణి చేస్తోంది. ఏం చూస్తే? మేడమీద రూం మెట్లు దిగి, తోటలో నుంచి నడచి నేను రోడ్డు మీదకు రాకూడదా? అదీ తప్పే? పదండి అలా నడిచి, ఆ కనిపించే పార్కులో కూర్చుందాం."

ఎందుకో కమలకు ఇష్టంగానూ వుంది. అయిష్టంగానూ వుంది.

ఇద్దరూ పార్కులోకి వచ్చారు. నిజానికి ఆ టైంలో పార్కుకు ఎవరూ రారు. బాగా ఎండ చల్లబడ్డాక సాయంత్రం వేళ వస్తారు. పార్కులో తోటమాలి చెట్లకి నీళ్ళు పోస్తున్నాడు వీళ్ళిద్దరినీ చూచి క్షణకాలం ఆశ్చర్యంగా చూచినా, తిరిగి తన పనిలో నిమగ్నమై పోయాడు. నగర జీవితంలో యిలాటి యువతీ యువకుల్ని రోజూ వందల మందిని చూస్తున్నాడు కాబట్టి,

"ఇక్కడ బాగా నీడగా వుంది, కూర్చుందాం రండి." బాగా వలయాకారంలో అల్లుకుని వున్న క్రీపర్స్ మాటుగా తన కర్చీఫ్ పరుస్తూ అన్నాడు సుధీర్. మంత్రముగ్ధలా కూర్చుంది కమల.

"కమలా!"

అంత సన్నిహితంగా అతగాడు కూర్చోవటం, ఆ పిలుపూ ఏదో గమ్మత్తుగా వుంది కమలకు.

"అట్టే ఉపోద్ఘాతం నాకిష్టం లేదు. ఐ లవ్ యూ కమలా! ఐ లవ్ యూ." గబుక్కున కమల చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అన్నాడు సుధీర్.

కమలాకా స్పర్శ శరీరమంతా ఝల్లుమనిపించింది,

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments